క్లుప్తంగా

కార్యవర్గం ఎన్నిక

సిరిసిల్లటౌన్: తెలంగాణ వారాల సంఘం కరీంనగర్ జోన్ ఆధ్వర్యంలో పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు కరీంనగర్ జోనల్ అధ్యక్షుడు వెలిశెట్టి వెంకటేశం ప్రకటించారు. అధ్యక్షుడిగా గుండమీది రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా వెలిశెట్టి లింగయ్య, బోదు సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా పసుల సుందర్, సహాయ కార్యదర్శిగా దుబాల రవీందర్, కోశాధికారిగా కొండమీది మొగిలి, కార్యవర్గ సభ్యులుగా దుబాల మనోహర్, కొండమీద శంకర్, సాయి కుమార్, అమిశెట్టి సురేశ్, వెలిశెట్టి నవీన్, ముఖ్య సలహాదారులుగా దుబాల వెంకటేశం, మొండయ్య, కరీంనగర్ జోనల్ కౌన్సిల్ సభ్యులు దుబాల బుచ్చిరాజు ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుబాల రాజేశం, జోనల్ కార్యవర్గ సభ్యులు, సిరిసిల్ల సంఘం సభ్యులు, యువజన సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



సిరిసిల్లటౌన్: జిల్లాకేంద్రంలో రెండ్రోజుల క్రితం జరి గిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పట్టణానికి చెందిన అక్కెనపల్లి కిరణ్మై ప్రతిభ చాటి ప్రథమ బహుమతి సాధించింది. శివనగర్ షాదీఖానాలో జరిగిన 2స్టేట్ లెవల్ ఓపెన్ టు అల్ స్టైల్ కరాటే, కుంగ్ఫూ చాంపియన్ షిప్ 2025 పోటీలో ఫస్ట్ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించింది.

రైతుల సంక్షేమానికి కృషి



కంది విత్తనాలతో రైతులు

బోయినపల్లి: రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఏఎంసీ చైర్మన్ ఎల్లేశ్‌యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని కోరెం క్లస్టర్ రైతు వేదికలో జాతీయ ఆహార భద్రత పథకం (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం–2025) కింద ఎంఏవో ప్రణీత ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై కంది విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ మాట్లాడుతూ గుర్తించిన రైతులకు వందశాతం రాయితీతో కంది విత్తనాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఏఈవో లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ పారదర్శకంగా నిర్వహించాలి

బోయినపల్లి: గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించిన సామాజిక తనిఖీలు పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ భీమా జయశీల పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సోషల్ ఆడిట్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్ పర్సన్ దేవేందర్, పీఆర్‌ఏఈ సాయితేజ, ఈజీఎస్ ఏపీఓ వనం సబిత, పంచాయతీ కార్యదర్శులు ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. తడగొండ, మల్కాపూర్, రత్నంపేట, నీలోజిపల్లి, కొదురుపాక, జగ్గారావుపల్లి, మల్కాపూర్, కొత్తపేటలో మొదటి ఫేస్‌లో తనిఖీ బృందాలు రిపోర్ట్ చేసినట్లు ఏపీవో సబిత తెలిపారు.

యువకులు లక్ష్యంతో చదవాలి



వీర్నపల్లి: మండల కేంద్రానికి చెందిన మల్లారపు విజయ్ బీఎస్ ఎఫ్ (బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్)లో ఉద్యోగం సాధించగా సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై వేముల లక్ష్మణ్ సన్మానించారు. అనంతరం ఆయన యువకులు లక్ష్యంతో చదివి ఉద్యోగాలు సాధించాలన్నారు.

చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట: యూరియా కొనుగోలుకు గ్రోమోర్ కేంద్రానికి వస్తే రైతులను ఇబ్బందికి గురి చేస్తున్నారని ఆరోపిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. మండలకేంద్రంలోని గ్రోమోర్ కేంద్రం నిర్వాహకులు రైతుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారని పదిరకు చెందిన రైతులు మద్దుల పద్మారెడ్డి, పర్శరాంరెడ్డి, చంద్రారెడ్డి, దేవరాజు, నర్సింలు ఆరోపించారు. యూరియాను రైతులకు విక్రయించకుండా బ్లాక్ చేస్తున్నట్లు తెలిపారు. నిర్వాహకులపై చర్యలు తీసుకొని రైతులకు యూరియా అందించాలని మండల వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేశారు.

శిథిలావస్థ ఇళ్లను గుర్తించాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను కార్యదర్శులు గుర్తించాలని మాజీ ఏఎంసీ చైర్మన్ కొండ రమేశ్ గౌడ్ అన్నారు. శిథిలావస్థ ఇళ్లలో ఉంటున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. గతేడాది వర్షాలకు కూలిన ఇళ్ల నిర్వాసితులకు పరిహారం ఇవ్వలేదన్నారు. కూలిన ఇళ్లను పరిశీలించి పరిహారం అందించాలన్నారు.

జరిమానా

ఇల్లంతకుంట: మండలంలోని ముస్కానిపేట గ్రామ పంచాయతీ పరిసర సమీపంలో సోమవారం జిల్లా కేంద్రానికి చెందిన వ్యక్తి సెప్టిక్ ట్యాంక్‌లోని నీటిని పారబోశాడు. గమనించిన గ్రామస్తులు, గ్రామపంచాయతీ సిబ్బంది, వాహన డ్రైవర్‌ను ప్రశ్నించారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యదర్శి రాజయ్య సెప్టిక్ క్లీనర్ కే శ్రీనివాస్‌కు రూ.3వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

కక్షిదారులకు కడుపునిండా..

- ప్రతీ శుక్రవారం అన్నదానం
- వేములవాడ కోర్టులో వినూత్న కార్యక్రమం
- హర్షం వ్యక్తంచేస్తున్న కక్షిదారులు



కోర్టు ఆవరణలో కక్షిదారులకు అన్నదానం చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్ జాదవ్, తదితరులు

వేములవాడ: వేములవాడ కోర్టు ఆవరణలో శుక్రవారం ప్రత్యేకం. న్యాయపోరాటం కోసం వచ్చే వృద్ధులు, మహిళలు, పేదలకు కడుపు నిండా భోజనం అందించేందుకు బార్ అసోసియేషన్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్ సూచన ప్రతీ శుక్రవారం కోర్టు విచారణ మధ్య విరామ సమయంలో అన్నదానం నిర్వహిస్తున్నారు. ప్రతీ శుక్రవారం కోర్టుకు వచ్చే కక్షిదారులకు అన్నదానం నిర్వహించడం ఈ కోర్టు ప్రత్యేకతగా మారింది. నెలరోజుల క్రితం వంగల కర్ర అడ్వకేట్ బర్త్‌డే వేడుకల్లో హాజరైన సీనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్ జాదవ్ సూచనమేరకు వేములవాడ బార్ అసోసియేషన్ ప్రతీ వారం కోర్టుకు వచ్చే కక్షిదారులకు నాలుగు వారాలుగా అన్నదానం చేస్తున్నారు. దీంతో కక్షిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ తరహా కార్యక్రమాలు ఇతర కోర్టులకు కూడా ఆదర్శంగా నిలవాలని భావిస్తున్నారు.

అభినందనీయం



చాలాకోర్టులు చూశాం. ఎక్కడా ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం లేదు. అన్నదానం నిర్వహించడం అభినందనీయం. దేశ వ్యాప్తంగా కోర్టుల్లో అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తే ఎంతోమందికి ప్రయోజనకరంగా ఉంటుంది. – ముత్యంరావు, లింగంపేట, చందుర్తి మండలం

ఆనందంగా ఉంది



నేను పదేళ్లుగా కోర్టు చుట్టూ తిరుగుతున్నా. కానీ ఎక్కడా ఇలాంటి అన్నదానం కార్యక్రమం నిర్వహించలేదు. న్యాయం కోసం వచ్చి ఒక్కోసారి రాత్రి వరకు కోర్టులో ఉండేది. ప్రతీ శుక్రవారం అన్నదానం చేయడం అభినందనీయం. – ఆకుల భూమక్క, రుద్రంగి

దాతల సహకారంతో



వేములవాడ బార్ అసోసియేషన్ సభ్యులు, ఇతర అడ్వకేట్లు, కోర్టు సిబ్బంది సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగించేందుకు ప్రయత్నిస్తాం. దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు. – గుండ రవి, గడ్డం సత్యనారాయణరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం



ముస్తాబాద్ : మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరవింద



వేములవాడ రూరల్ : అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఇల్లంతకుంట: తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యమని జిల్లా సీడీపీవో ఉమారాణి అన్నారు. మండలంలోని పెద్ద లింగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కల్పించారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్ సూర్య కళ, మెడికల్ ఆఫీసర్ ప్రేమ్‌కుమార్, రసజ్ఞ, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ముస్తాబాద్: తల్లిపాలతో శిశువుకు ఆరోగ్యమని అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరవింద అన్నారు. మద్దికుంట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, ఏఎన్‌ఎంలు మణెమ్మ, విజయనిర్మల, టీచర్ విజయ, మహిళలు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని అంగన్‌వాడీల్లో తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. జ్యోతి తల్లిపాల ప్రాముఖ్యత, పోషకాలపై వివరించారు. ఆరోగ్య సిబ్బంది, ఆశాలు తదితరులుఉ పాల్గొన్నారు.

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. బాలింతలు, మహిళలు, అంగన్‌వాడీ టీచర్లు అరుణ, విజయ, తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమని అంగన్‌వాడీ టీచర్ బుర్ర రేణుక అన్నారు. బండపల్లి అంగన్‌వాడీ రెండో కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ న్యాగ పద్మ, గసికంటి రేణుక, ఏఎన్‌ఎం వజ్ర, ఆశ వర్కర్లు వసంత, మహంకాళి రమ, తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: తడగొండ అంగన్‌వాడీకేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ నిర్మల, హెల్త్ సూపర్‌వైజర్ హేమలత, అంగన్‌వాడీ టీచర్ రాజమణి, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

అడ్వాన్స్‌డ్ స్టూడియో ఏర్పాటు అభినందనీయం



ప్రారంభిస్తున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

వేములవాడ: హైదరాబాద్ తరహాలో వేములవాడలో అడ్వాన్స్‌డ్ స్టూడియో ఏర్పాటు చేయడం అభినందనీయమని ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి అన్నారు. పట్టణంలోని రెండో బైపాస్‌రోడ్డులో మ్యాడ్ ఫొటోగ్రఫీ ఆధ్వర్యంలో ఇట్స్ ఏ న్యూ బిగినింగ్ స్టూడియోను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో కలిసి స్టూడియోను సందర్శించారు. ట్రెండింగ్‌లో ఉన్న బ్రాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూస్ కూడా ఈ స్టూడియోలో నిర్వహించేందుకు వీలు కల్పించడంపై సృజనాత్మకత ఉన్న యువతకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం నిర్వాహకులను అభినందించారు. నిర్వాహకులు సయ్యద్ ఇబ్రార్‌పాషా, నగుబోతు అరవింద్, కుమ్మరి నితిన్, సునీల్, నగుబోతు రవి, కుమ్మరి శంకర్, నారాయణరెడ్డి, ఆనందరెడ్డి, లాయక్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్స్‌కు దూరంగా ఉండాలి

- సిరిసిల్లరూరల్ సీఐ మొగిలి
- జవారిపేట యువకుల ఫోన్లు పరిశీలన



జవారిపేటలో యువకుల ఫోన్లు పరిశీలిస్తున్న సీఐ మొగిలి

ఇల్లంతకుంట: యువకులు ఆన్‌లైన్ గేమ్స్‌కు దూరంగా ఉండాలని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి కోరారు. మండలంలోని జవారిపేటలో సోమవారం రాత్రి కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. అంతకుముందు గ్రామంలో పర్యటించిన సీఐ పలువురి యువకుల నుంచి ఫోన్‌లు తీసుకొని పరిశీలించారు. గ్రామంలోని యువత ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నట్లు తమ సమాచారం వచ్చిందన్నారు. ఇకపై వాటి జోలికి పోవద్దన్నారు. యువత సన్మార్గంలో వెళ్లి, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఎస్సై సిరిసిల్ల అశోక్, ఆర్‌ఎస్‌ఐ శ్రావణ్, ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి



వేములవాడ: మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషిచేస్తుందని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని భగవంతరావునగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రాజరాజేశ్వరి బోటిక్ అండ్ బ్యూటీ పార్లర్‌తోపాటు మ్యాచింగ్ సెంటర్‌ను సోమవారం ప్రారంభించారు. స్వయంకృషితో రాజరాజేశ్వరి సెంటర్‌ను ప్రారంభించుకున్న మారేపు హేమలత, స్వప్న, చందనగిరి తేజస్విని విప్ అభినందించారు.

హామీలిచ్చి మోసం చేసిన కాంగ్రెస్

తంగళ్లపల్లి: కాంగ్రెస్ పార్టీ 420 హామీలు, ఆరు గ్యారంటీలు అమలు చేస్తామంటూ మోసం చేసిందని కేటీఆర్ సేన మండల అధ్యక్షుడు నందగిరి భాస్కర్ గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని నేరెళ్లలో కేటీఆర్ సేన గ్రామశాఖ ఏర్పాటుచేసి అధ్యక్షుడిగా నమిలికొండ అనిల్‌ను నియమించారు. ఈ సందర్భంగా భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుచేసే వరకు పోరాటం చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటుతుందన్నారు.కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కోడూరి శ్రీనివాస్, సీనియర్ నాయకులు దొంతినేని చంద్రారావు, కోల గోపాల్, మాజీ ఎంపీటీసీ మీసాల కృష్ణ, కలకుంట్ల వెంకట్రావు, నాయకులు బంటు రవి, దాసరి అనిల్ పాల్గొన్నారు.

• ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

కోనరావుపేట: మండలంలోని కొలనూరులో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో శిథిలావస్థకు చేరిన పోచమ్మ ఆలయాన్ని తొలగించి నూతనంగా నిర్మించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

• ముళ్ల చెట్టు తొలగింపు

బోయినపల్లి: బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే రోడ్డులో భూమయ్య హోటల్ ముందు రోడ్డుపైకి ఓ పెద్ద చెట్టు కొమ్మ వచ్చింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండగా సాక్షిలో వాట్సాప్ శీర్షికన ఈనెల 3న కథనం ప్రచురితమైంది. ఎంపీడీవో భీమ జయశీల ఆదేశాలతో ఇంటి యజమానికి చెట్ల కొమ్మలు తొలగించాలని నోటీస్ అందించారు. సోమవారం రాత్రి రోడ్లపైకి వచ్చిన ముళ్ల చెట్టును జేసీబీతో మాజీ సర్పంచ్ సంబ లక్ష్మిరాజం సహకారంతో తొలగించారు. ప్రయాణికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి స్పందన

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జితో నాయకులు

ఎల్లారెడ్డిపేట: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను సోమవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గౌస్ కలిశారు. ×హలో బీసీ చలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నాకు రైలులో ప్రయాణించారు.

• మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె

ఎల్లారెడ్డిపేట: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6, 7 తేదీల్లో సమ్మె నిర్వహించనున్నట్లు కార్మికులు సోమవారం అధికారులకు సమ్మె నోటీస్ అందించారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ బాలరాజు, నర్సవ్వ, సత్యవ్వ, శ్యామల, జ్యోతి, లక్ష్మి, దేవలక్ష్మి, నిర్మల, లావణ్య, మల్లవ్వ, లత, దేవక్క తదితరులున్నారు.

• రైతులకు సరిపడా ఎరువులు అందించాలి

వీర్నపల్లి: మండలకేంద్రంలో మండల బీజేపీ శాఖ అధ్యక్షుడు మాలోత్ లక్పతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రైతులకు సరిపడే ఎరువు బస్తాలు ఇవ్వాలని, లేకపోతే మండలకేంద్రంలో రైతులతో ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బట్టు పిర్య, సీనియర్ నాయకులు బండారి మహేశ్, మాలోత్ ప్రకాశ్, , శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంటలో భారీ వర్షం



రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు

ఇల్లంతకుంట: మండలకేంద్రంతో పాటు జంగారెడ్డిపల్లి, వెల్జిపురం, పెద్దలింగాపూర్, రహీంఖాన్‌పేట, అనంతారం, తదితర గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. డ్రైనేజీలు నిండి రోడ్డుపై వరద నీరు ప్రవహించింది. పదిరోజుల తర్వాత వర్షం కురవడంతో రైతుల్లో ఆనందం నెలకొంది.

యూరియా కోసం బారులు



రుద్రంగిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

రుద్రంగి: మండలకేంద్రంలో సోమవారం రైతులు యూరియా కోసం బారులుతీరారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు వేచి ఉన్నా యూరియా దొరక లేదని రైతులు వాపోయారు. కొన్ని రోజులుగా యూరియా కోసం ఎదురుచూస్తున్నా దొరకడం లేదని, దొరికినా ఒకటే బస్తా ఇస్తున్నారన్నారు. వరి నాట్లు వేసి నెల దాటుతుందని పంట పొలాలకు యూరియా చల్లే సమయం దాటిపోతుందని రైతులు తెలుపుతున్నారు. సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలి



వేములవాడఅర్బన్: ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు


వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని మారుపాకలో 193,195 బూత్‌ల పరిధిలో సోమవారం బీజేపీ మహాసంపర్క్ అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఇంటింటా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల అనంద్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీని నేరవేర్చడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్‌గౌడ్, లింగంపల్లి శంకర్, వెంకటేశ్వరరావు, ప్రశాంత్, జింక అనిల్, లక్ష్మన్ తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లిలో 29వ బూత్ అధ్యక్షుడు పొన్నాల వెంకటేశ్ ఆధ్వర్యంలో ఇంటింటా బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి మాట్లాడారు. మహిళా మోర్చా అధ్యక్షురాలు దాసరి పూర్ణిమ, ప్రధాన కార్యదర్శి గణేష్, నాయకులు పిట్ల శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: రహీంఖాన్‌పేటలో బీజేపీ మహా సంపర్క్ అభియాన్ నిర్వహించారు. మానకొండూర్ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ బత్తిని స్వామి గౌడ్ బీజేపీ మండల అధ్యక్షుడు భూమల్ల అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి తిప్పారపు శ్రావణ్, ఉపాధ్యక్షులు గుంటి మహేష్, చిమ్మనగొట్టు శ్రీనివాస్, దండవేణి రజినికాంత్, నాయకులు అమ్ముల అశోక్, రాజు, కొలనూరు ముత్తక్క, తదితరులు పాల్గొన్నారు.

'నా ఆయుధ లైసెన్స్‌ను రద్దు చేయాలనుకున్నారు'

- కలెక్టర్‌పై మాజీ ఎమ్మెల్యే కటుకం మృత్యుంజయం ఆరోపణ



కటుకం మృత్యుంజయం

సిరిసిల్ల: నా రాజకీయ ప్రత్యర్థుల సలహాతో 40 ఏళ్లుగా ఉన్న ఆయుధ అనుమతి(గన్ లైసెన్స్) రద్దు చేయాలని ప్రయత్నించారు. ఇది ఖచ్చితంగా నన్ను నిరాయుధుడిని చేయాలనే రాజకీయ శత్రువుల కుట్ర. ఇది అధికార దుర్వినియోగానికి ప్రతీక అంటూ.. మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి కరీంనగర్ జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నేత గంభీరావుపేటకు చెందిన కటుకం మృత్యుంజయం జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాపై ఆరోపణలు చేశారు.

కలెక్టర్‌పై ఆరోపణలు

నా సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో జిల్లాల కలెక్టర్లను చూశా. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పనిచేసిన అందరూ కలెక్టర్లను కలిశాను. ప్రజల మదిలో నిలిచిపోయిన సేవా నిరతులు కూడా ఉన్నారు. కానీ ఈ కలెక్టర్‌లా విచిత్రమైన వైఖరి గల వ్యక్తిని నేను ఎప్పుడూ చూడలేదు. నా మొబైల్ నంబర్ బ్లాక్‌లో పెట్టారు. తప్పుడు ఆరోపణపత్రాలను కొందరి నుంచి స్వీకరించి, నాపై అభియోగాలు మోపుతూ తన కార్యాలయానికి విధిగా హాజరుకావాలని నోటీసులు ఇచ్చారు. జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ స్థాయిలో ఉన్న వ్యక్తి ప్రతీకార భావనతో ఇలా వ్యవహరించడమంటే, అది వ్యక్తిగత స్థాయికి మించిన దాడి అని నేను భావిస్తున్నా. అధికార దుర్వినియోగానికి ప్రజలు బలవుతున్నారు. ఆయన వెంటే ఉండి, ఎన్నో తప్పులు చేయిస్తున్న అనధికార వ్యక్తులే కారణం. ఈ విషయాన్ని ప్రభుత్వ, పార్టీ ప్రముఖుల దృష్టికి కూడా తీసుకెళ్లా అని మృత్యుంజయం పేర్కొన్నారు. ఈ విషయం సోషల్‌మీడియాలో వైరల్ కాగా.. మృత్యుంజయమే స్వయంగా సిరిసిల్లలోని వివిధ మీడియా ప్రతినిధులకు ఫార్వర్డ్ చేశారు.

బీసీ గర్జనకు తరలిన కాంగ్రెస్ నేతలు



ఎల్లారెడ్డిపేట : ఢిల్లీకి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు



చందుర్తి : తరలివెళ్తున్న నాయకులు

వేములవాడ: ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగే బీసీ గర్జన కార్యక్రమానికి వేములవాడ పట్టణ, అర్బన్ ప్రాంతాలకు చెందిన పలువురు నాయకులు ఉదయం చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి ఢిల్లీకి తరలివెళ్లారు. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, అర్బన్, రూరల్ కాంగ్రెస్ అధ్యక్షుడు వకుళాభరణ శ్రీనివాస్, పిల్లి కనకయ్య, జిల్లా కార్యదర్శి కూరగాయల కొమురయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, తదితరులు తరలివెళ్లారు.

గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట: ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద జరిగే బీసీల ధర్నాకు మద్దతుగా గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఢిల్లీకి తరలివెళ్లారు. వెళ్లిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, నాయకులు రాజశేఖర్, శ్రీనివాస్‌గౌడ శివరామకృష్ణ, తదితరులు వెళ్లారు.

చందుర్తి : ఢిల్లీలో జరిగే బీసీ గర్జన ధర్నాకు రుద్రంగి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు బొజ్జ మల్లేశంతో రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతితో నియోజకవర్గ నాయకులు తరలివెళ్లారు. కోనరావుపేట మండలం నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చుకాయల ఎల్లయ్య, రుద్రంగి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూం జలపతి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు గట్ల మీనయ్య, పీసీసీ సభ్యులు తోట్ల అంజయ్య, కూరగాయాల కొమురయ్య, గండి నారాయణ తదితరులు తరలివెళ్లారు.

వెలగని వీధిలైట్లు



పాత సెస్ ఆఫీస్ మూలవద్ద అంధకారం

బోయినపల్లి: మండలకేంద్రమైన బోయినపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో రాత్రి పూట వీధిలైట్లు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బస్టాండ్ ఏరియా నుంచి హైస్కూల్ రోడ్డులో, 11వ వార్డులో పాత సెస్ కార్యాలయం నుంచి, పాలేటి నర్సయ్య ఇంటి మీదుగా కల్వర్టు వరకు వీధిలైట్లు వెలగకపోవడంతో చీకట్లలో ప్రజలు బిక్కు బిక్కుమంటున్నారు. 12వ వార్డులో కురుమ వీధి, ఒకటో వార్డులో పలుచోట్ల వీధిలైట్లు నెలరోజులుగా వెలగడం లేదని ప్రజలు వాపోతున్నారు. వీధిలైట్లు లేకపోవడంతో రాత్రిపూట పాములు, జంతువులు తిరగడంతో ప్రమాదాలు జరుగుతాయని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బహుమతులు ప్రదానం

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ డిపోలో జూలైలో అత్యధికంగా డిజిల్ దుపు చేసిన ముగ్గురు డ్రైవర్లకు సోమవారం బహుమతులు ప్రదానం చేసినట్లు డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. మొదటి బహుమతి ఎల్. బాబురావుకు రూ. 500 ప్రశంసా పత్రం, రెండో బహుమతి పి. భూపతికి రూ. 300, మూడవ బహుమతిగా డి.బాల్‌రెడ్డికి రూ.300 అందించి అభినందించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నారాయణ, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు పంపిణీ



రేషన్‌కార్డులు పంపిణీ చేసున్న నాయకులు

ముస్తాబాద్: మండలంలోని రామలక్ష్మణపల్లెలో సోమవారం కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ప్రభుత్వం జారీచేసిన ప్రొసిడింగ్స్ కాపీలను లబ్ధిదారులకు అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలు అమలు చేస్తోందన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, మండల అధ్యక్షురాలు అనిత, జిల్లా కార్యదర్శి కొండం రాజిరెడ్డి, పాక చంద్రమౌళి, గజ్జెల రాజు, సిద్దారెడ్డి, వేణు, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న మునిగెల రాజు

తంగళ్లపల్లి: మండలంలోని చీర్లవంచలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా నాయకుడు మునిగెల రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకు దోహదం చేస్తాయన్నారు. ప్రభుత్వ పథకాలు ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, మహిళలకు పావలా వడ్డీ, ఆరోగ్య శ్రీ రూ.10 లక్షలకు పెంపును ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నలువాల జలంధర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.